

విద్యార్థి నవదీప్‌ను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం నర్సింగరావు

## రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

గంభీరావుపేట, డిసెంబర్15: మండలంలోని మల్లారెడ్డిపేట పాఠశాలకు చెందిన జక్కుల నవదీప్ రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నర్సింగరావు తెలిపారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న నవదీప్ అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా నవదీప్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. రానున్న రోజుల్లో ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఎనిమిది మందికి జైలు

వేములవాడ, డిసెంబర్ 15: మద్యంతాగి వాహనాలు నడిపిన ఎనిమిది మందికి వేములవాడ న్యాయస్థానం జైలు శిక్ష విధించిందని శుక్రవారం పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో పట్టుపడిన 13 మందిని వేములవాడ న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా, అందరికీ రూ.2వేల చొప్పున జరిమానా, ఎనిమిది మందికి జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి గమ్యానికి క్షేమంగా చేరుకోవాలని ఆయన సూచించారు.

## నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ వారోత్సవాలు




మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఇల్లంతకుంట, డిసెంబర్ 15: నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ వారోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ ఎం మహేశ్‌చంద్ర మాట్లాడుతూ, నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్‌ను పురస్కరించుకొని ఆదిత్య హర్నెస్ ఏకో క్లబ్ ఆధ్వర్యంలో 50మంది విద్యార్థులతో పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఎనర్జీ వాక్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు, క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించి, విజేతలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. సౌర శక్తిని వినియోగిద్దాం-కాలుష్యాన్ని నివారిద్దాం అం టూ నినదిస్తూ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.

## ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ పై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

ఇల్లంతకుంట, డిసెంబర్ 15: మండల కేంద్రంతోపాటు రహీంఖాన్‌పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇటీవల బదిలీ కాగా శుక్రవారం వారిని సర్పంచ్ కూనబోయిన భాగ్యలక్ష్మి, హెచ్‌ఎం ప్రేమలత సన్మానించారు. ఇక్కడ ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ వేణు, సార మల్లేశం, మోహన్‌రెడ్డి, మహేశ్‌చంద్ర, అనిల్‌కుమార్, మధుసూదన్‌రావు, మంజుల, స్వప్న, తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

సారంగాపూర్, డిసెంబర్ 15: అర్పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి హాకీ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. హుజూరాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి హాకీ క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు బీ గణేశ్, చిర్ర ప్రశాంత్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి హాకీ క్రీడలకు ఎంపికైనట్లు వెల్లడించారు. డిసెంబర్ 16, 17, 18 తేదీల్లో కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని అన్నారు. ఈ సందర్భంగా హాకీ క్రీడలకు ఎంపికైన విద్యార్థులను ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

# ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాలి



కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా ఇన్‌చార్జి అజయ్‌గుప్తా

- కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి, విక్ సిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా ఇన్‌చార్జి అజయ్‌గుప్తా
- కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం

కలెక్టరేట్, డిసెంబర్ 15: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తూ, ప్రజలకు తెలియజేయడానికి 'విక్ సిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమాన్ని చేపట్టామని కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి, విక్ సిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా ఇన్‌చార్జి అజయ్‌గుప్తా పేర్కొన్నారు. ఈ నెల 16నుంచి వచ్చే నెల జనవరి 26 వరకు జిల్లాలో చేపట్టనున్న విక్ సిత్ భారత్ సంకల్ప్ యాత్ర' నిర్వహణపై శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్ సంబంధిత ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమం ప్రభావవంతంగా చేపట్టేందుకుగానూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అజయ్‌గుప్తా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. గ్రామీణ స్థాయిలో చాలా మందికి అవగాహన లేకపోవడంతో లబ్ధి చేకూరడం లేదనే విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇప్పటికే లబ్ధి పొందిన వారి నుంచి సూచనలు, సలహాలు సేకరించాలన్నారు. ప్రజలను పెద్దఎత్తున భాగస్వామ్యం చేస్తూ, అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాల లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కేంద్రం ప్రారంభించిందని తెలిపారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ, కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల ప్రచార వాహనాలను జిల్లాలో సుమారు 40రోజుల పాటు క్షేత్ర స్థాయిలో పర్యటించేలా షెడ్యూల్ రూపొందించామని వివరించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాలో విక్ సిత్ భారత్ సంకల్ప్ యాత్రను విజయవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి, అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, ఐడీఎం మల్లికార్జున్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### గల్ఫ్ వలస కార్మికులకు

## ఉచిత ఉపాధి శిక్షణ

- ఉపాధి కల్పనాధికారి సత్తమ్మ

జగిత్యాల రూరల్, డిసెంబర్ 15: గల్ఫ్ వలస కార్మికులకు ఉచిత ఉపాధి శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జగిత్యాల జిల్లా ఉపాధి కల్పనాధికారి సత్తమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కొరకు ఐవోఎం సౌజన్యంతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ న్యాక్ ఆధ్వర్యంలో విదేశాల నుంచి తిరిగి వచ్చిన కార్మికులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్స్ 30 మందికి, జనరల్ ప్లంబర్స్ 50 మందికి, తాపీ మేస్త్రి 60 మందికి, సెంట్రింగ్ కార్పెంటర్ 50 మందికి , బార్ బిల్డింగ్ అండ్ స్టీల్ ఫిక్సింగ్‌లో 60 మందికి 15 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజనం అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఆసక్తి గల గల్ఫ్ కార్మికులు ఈనెల 18 సాయంత్రం 5 గంటల వరకు జగిత్యాల ఎంప్లాయిమెంట్ కార్యాలయం కలెక్టరేట్ రూం నంబర్ 218లో లేదా న్యాక్ సెంటర్ నూకపెల్లిలో లేదా రాయికల్‌లో రిజిస్టేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94913 22556, 70367 23800, 99630 50734 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ జగిత్యాల జిల్లా ఇన్‌చార్జిలు కాయితి శంకర్, మార్వాడి సుదర్శన్, న్యాక్ ఏడీ గోలి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



కోరుట్ల: ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కోరుట్ల, డిసెంబర్ 15: పట్టణంలోని పురాతనమైన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయానికి రంగురంగుల దీపాలను అలంకరించి ముస్తాబు చేశా రు. ఆలయ ప్రధాన అర్చకుడు బీర్నంది లక్ష్మీనర్సింహచార్యులు వైదిక నిర్వహణలో పద్మావవీ, గోదాదేవీ సమేత వేంకటేశ్వర స్వామి వారికి ప్ర త్యేక పూజలు, విశేష అలంకరణ చేశారు. జనవ రి 17వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారి విక్రమ్ తెలిపారు. ఆలయంలో వైకుంఠ ఏకదాశి (ముక్కోటి ఏకాదశి), లక్ష పుష్పర్చాన, వన మహోత్సవం, కుడారై ఉత్సవం, గోదా, రంగనాయకుల కల్యాణం, ఉంజల్ సేవా, ఏకాంత సేవ పూజలు జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### ధర్మపురిలో నేటి నుంచి..

ధర్మపురి, డిసెంబర్ 15: ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామివారి ఆలయంలో శనివారం నుంచి ధనుర్మాసోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 16 నుండి వచ్చే నెల 14వ వరకు ప్రధాన దేవాలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 23న ఉదయం 3 గంటల నుంచి ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే జనవరి 13న ఉదయం 11 గంటలకు శేషప్ప కళావేదికపై గోదాకల్యాణం వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

కోరుట్ల రూరల్, డిసెంబర్ 15: నాగులపేట గ్రామశివారులోని నాగులమ్మ ఆలయ ఆవరణలో అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గూడెం గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకార్చనలు, పదునెట్టాంబడి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామియే శరణమయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం సామూహిక సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కే భాస్కర్‌రెడ్డి, అర్చకులు దమ్మన్నగారి శంకర్‌శర్మ, కిషన్‌శర్మ, ఎంపీపీ తోట నారాయణ, సహకార సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి నర్సారెడ్డి, అయ్యప్ప మాలధారులు లక్ష్మీనారాయణ, నాగరాజు, నర్సారెడ్డి, నారాయణరెడ్డి, సుధాకర్, సాగర్, గ్రామ అయ్యప్ప సేవా సమితి, భక్తులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

కోరుట్ల, డిసెంబర్ 15: పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల బీకాం విద్యార్థి కొడిమ్యాల శ్రీపాల్ జాతీయ స్థాయి ఖోఖో క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. కేరళలోని కాలికట్ యూనిర్సిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 26 నుంచి జరుగనున్న ఆల్ ఇండియా సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో టోర్నమెంట్‌లో పాల్గొనే శాతవాహన యూనివర్సిటీ కరీంనగర్ జట్టులో శ్రీపాల్ స్థానం సాధించనట్లు కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ శుక్రవారం తెలిపారు. జాతీయ జట్టులో స్థానం దక్కించుకున్న విద్యార్థిని కళాశాల డైరెక్టర్లు హరిప్రియ, అంజయ్యగౌడ్, ఫిజికల్ డైరెక్టర్ దయాత్రి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

## జిల్లా స్థాయి యువజనోత్సవాలు

జగిత్యాల టౌన్, డిసెంబర్ 15: ఈ నెల 29న ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో జిల్లాస్థాయి సాంస్కృతిక, యువజనోత్సవ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి డాక్టర్ కోరుకంటి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు సంబంధించిన కళాకారులకు జానపద నృతం (గ్రూప్), జానపద నృతం (సోలో), జానపద పాట (గ్రూప్), జానపద పాట (సోలో), లైఫ్ స్కిల్స్ కాంపోనెంట్ (కథా రచన, పోస్టర్ మేకింగ్, ప్రకటన, ఫొటోగ్రఫీ) పోటీల్లో ప్రతి అంశంలోని విజేతలను నిర్ణయించి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే యువతీ యువకులు 15 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాల లోపు ఉండి, పోటీలో పాల్గొనే అంశానికి సంబంధించిన సామగ్రిని కళాకారులు తమ వెంట తీసుకొని రావాలని సూచించారు. అదేవిధంగా జానపద నృత్య బృందంలో 10 మంది సభ్యులు ఉండి 15 నిమిషాల గరిష్ట కాలపరిమితి మించకుండా ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## తపాలా ఉద్యోగుల సమ్మె

జగిత్యాల, డిసెంబర్ 15: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తపాలా శాఖలోని గ్రామీణ డాక్ సేవక్‌ల సమ్మె శుక్రవారం నాల్గోరోజు కొనసాగింది. జగిత్యాల హెడ్ పోస్టాఫీస్ ఎదుట వివిధ గ్రామాల ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. 7వ వేతన సవరణ సంఘం ఇచ్చిన నివేదికలో ఉన్న డిమాండ్లు అమలు చేయాలని కోరారు. డిమాండ్లు సాధించే వరకు సమ్మె విరమించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు కాలగిరి శ్రీనివాసరెడ్డి, రమపతిరావు, చెంగలి గంగాధర్, రాజేందర్ పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సారంగాపూర్, డిసెంబర్ 15: బీర్‌పూర్ మండలంలోని చర్లపల్లి గ్రామం లో శుక్రవారం ఆర్థిక అక్ష్యరాస్యత కార్యక్రమంపై కేడీసీసీబీ బ్యాంక్ తుంగూర్ శాఖ మేనేజర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేనేజర్ హరిప్రసాద్ మాట్లాడుతూ, బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అజ్మీరా ప్రభాకర్, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్, సిబ్బంది లవన్ కుమార్, సెక్రటరీ తిరుపతి పాల్గొన్నారు.